క్లుప్తంగా

షాద్‌నగర్‌కు కళాశాల మంజూరు చేయండి

సీఎం రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్యే వినతి



సీఎంను కలిసిన ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే

షాద్‌నగర్: షాద్‌నగర్‌కు ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాలను మంజూరు చేయాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. మంగళవారం రాత్రి హైదరాబాద్‌లోని అంబేడ్కర్ భవన్‌లో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డిలు సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. షాద్‌నగర్ ప్రాంతం విద్యారంగంలో అభివృద్ధి చెందుతుందని, పేద విద్యార్థుల ఉన్నత చదువులకు ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాలను మంజూరు చేయాలని ఎమ్మెల్యే సీఎంను కోరారు. కళాశాల ఏర్పాటుపై సీఎం సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

విద్యావలంటీర్‌కు వేతనం అందజేత



వలంటీర్‌కు వేతనం అందిస్తున్న రాజేశ్‌పటేల్

కొందుర్గు: మండల కేంద్రంలోని దళితవాడ ప్రాథమిక పాఠశాలలో 5 తరగతులకుగాను ఇద్దరు ఉపాధ్యాయులే ఉన్నారు. ఈ సందర్భంగా మాజీ వైస్ ఎంపీపీ రాజేశ్‌పటేల్ స్పందించి గ్రామానికి చెందిన కవితను విద్యా వలంటీర్‌గా నియమించారు. బుధవారం కవితకు మొదటి నెల వేతనం అందించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు రాజేశ్‌పటేల్‌ను అభినందించారు.

చీడపీడలను మొదటి దశలోనే నివారించాలి



పత్తిచేనును పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

కొత్తూరు: పత్తి, మొక్కజొన్న, కూరగాయాల పంటలను ఆశించే చీడపీడలను మొదటి దశలోనే గుర్తించి తగిన మందులు వాడితే చక్కటి ప్రయోజనం ఉంటుందని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చెందిన శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా బుధవారం వారు దత్తత తీసుకున్న మండలంలోని మల్లాపూర్ గ్రామంలో పలువురు రైతులు సాగుచేస్తున్న పత్తి, మొక్కజొన్న, పూలతోటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రసం పీల్చే పురుగులతో పాటు పంటలకు పలు తెగుళ్లు ఉన్నట్లు గుర్తించి వాటి నివారణ చర్యలను రైతులకు తెలియజేశారు. పంటల సాగులో రైతులు వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటించాలని కోరారు. ముఖ్యంగా మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలనే సాగు చేయాలన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు పద్మశ్రీ, ప్రమీల, అరుణ, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ రికార్డులు స్వాధీనం

శంకర్‌పల్లి: ఇటీవల శంకర్‌పల్లి మండలం నుంచి మిర్జాగూడ గ్రామం నార్సింగి మున్సిపాలిటీలోకి విలీనమైన విషయం తెలిసిందే. అయితే బుధవారం నార్సింగి మున్సిపల్ కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి మిర్జాగూడలో పర్యటించారు. అనంతరం గ్రామ పంచాయతీలోని రికార్డులన్నింటినీ స్వాధీనం చేసుకున్నారు. జీపీ భవనంపై గ్రామ పంచాయతీ కార్యాలయం అని ఉండగా తొలగించి నార్సింగి మున్సిపాలిటీ అని రాయించారు. అదేవిధంగా ప్రస్తుత మాజీ ప్రజాప్రతినిధులైన మాజీ సర్పంచ్ రవీందర్‌గౌడ్, నాయకులు కిషన్‌సింగ్, వెంకటేశ్‌లతో కాసేపు మాట్లాడి వెళ్లిపోయారు.

సహజసిద్ధ నాలాలను కాపాడాలని వినతి

శంకర్‌పల్లి: మోకిల గ్రామంలోని సహజసిద్ధ నాలాలను కాపాడాలని కోరుతూ గ్రామస్తులు బుధవారం కలెక్టర్ శశాంకను కలిసి వినతిపత్రం అందించారు. మోకిల గ్రామ ప్రణాళికలోని నాలాలను లా పలోమా విల్లాల యజమాని కబ్జా చేసి విల్లాలు నిర్మించాడని, దీంతో నాలా ద్వారా వచ్చే నీళ్లు తమ పొలాల్లోకి వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులతో సర్వే చేయించి నాలాలను కాపాడాలని విజ్ఞప్తి చేశారు.

ఇంకెన్నాళ్లు..?

'డబుల్' ఇళ్ల పంపిణీలో అధికారుల నిర్లక్ష్యం

- నగం పంపిణీ చేసి చేతులు దులుపుకొన్న అధికారులు
- ఇచ్చిన వాటిలోనూ అరకొర సదుపాయాలే
- స్థానికులు, అర్హులకే ఇవ్వాలని నాయకుల డిమాండ్



శంకర్‌పల్లిలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లు

శంకర్‌పల్లి: ఇన్ని ఇస్తున్నాం.. అన్ని ఇస్తున్నాం.. అలా ఇస్తున్నామంటూ గొప్పలు చెప్పి, ఆర్భాటంగా ప్రారంభించిన డబుల్ బెడ్రూం ఇళ్లు నేటికీ పూర్తిస్థాయిలో నిరుపేదలకు అందుబాటులోకి రాలేదు. ప్రారంభించి 9 నెలలు కావొస్తున్నా సగం మాత్రమే పూర్తిచేసి ఇవ్వడంతో మిగిలిన వారికి ఎదురుచూపులే మిగిలాయి. ప్రజాప్రతినిధులు, నాయకుల హంగామా అంతా ఎన్నికల ముందు వరకే అని ప్రజలు సరిపెట్టుకోవడం వారివంతు అయ్యింది. సెప్టెంబర్ 15వరకు అప్పగిస్తామని అధికారులు చెబుతున్నా అది సాధ్యమయ్యే పరిస్థితి కనిపించడం లేదు. శంకర్‌పల్లిలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్ల పరిస్థితి ఇది.

మొత్తం 1512 ఇళ్లు

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిరుపేదలకు ఇళ్లు ఇవ్వాలనే లక్ష్యంతో శంకర్‌పల్లి పట్టణ శివారులో భారీస్థాయిలో డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించింది. కేంద్ర ప్రభుత్వ పథకం ప్రధాన మంత్రి ఆవాస్ యోజన, రాష్ట్ర ప్రభుత్వం కలిసి సంయుక్తంగా 130.79లక్షల రూపాయలతో సుమారు 9.33ఎకరాల విస్తీర్ణంలో 14 బ్లాకులుగా విభజించి బిల్డింగ్‌లను నిర్మించారు. ఒక్కో బ్లాకులో 108 ఇళ్ల చొప్పున మొత్తంగా 1512 ఇళ్లను నిర్మించారు. అయితే 2023 ఎన్నికల ముందు వరకు ఆ బిల్డింగ్‌లలో కనీస మౌలిక సదుపాయాలైన కరెంటు, తాగునీరు వంటివి లేవు. అయినా సరే ఎన్నికల కోసం అప్పటి ప్రభుత్వం హడావిడిగా అక్టోబర్ 2న అప్పటి మంత్రి మహేందర్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించింది. ఇక్కడ నిర్మించిన ఇళ్లను కార్వాన్, యాకుత్‌పురా నియోజకవర్గాల్లోని నిరుపేదలకు ప్రభుత్వం కేటాయించింది. దీన్ని స్థానిక నాయకులు, ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించారు.

అరకొరగానే సదుపాయాలు..

మంత్రి చేతుల మీదుగా ఆర్భాటంగా ప్రారంభమైనా లబ్ధిదారులకు మాత్రం అరకొర వసతులతోనే సుమారు 9 నెలల(జూన్‌లో) తర్వాతనే అందుబాటులోకి వచ్చాయి. దాంట్లో సైతం మొదటి నుంచి ఏడు బ్లాకుల్లో మాత్రమే సదుపాయాలు అందుబాటులోకి రాగా.. వాటిలో ప్రస్తుతం సుమారు 100 కుటుంబాలు వచ్చి నివాసం ఉంటున్నారు. మిగిలిన ఎనిమిది నుంచి పద్నాలుగు బ్లాకుల వారికి ఈనెల 15వరకు ఇస్తామని అధికారులు చెబుతున్నారు. కానీ అక్కడున్న పరిస్థితులను చూస్తే వారం రోజుల్లో పనులు పూర్తయ్యే అవకాశాలు కనిపించడం లేదు. ఆ బ్లాకులలో పనులు జరుగుతున్నట్లు జాడ కనిపించకపోవడమే దానికి గల కారణం.

రోడ్డే లేదు.. ఇళ్లలో అప్పుడే లీకేజీలు

పట్టణ శివారులో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లకు ఇప్పటివరకు రోడ్డు అనేది లేదు. జూన్‌లో కొంత మంది వచ్చి ఉంటున్నా సరైన రోడ్డు మార్గం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాలు పడినప్పుడు పక్కన ఉన్న వెంచర్‌లోని రోడ్డు మార్గాన్ని ఉపయోగించుకుంటున్నారు. ఇప్పుడు డబుల్ బెడ్రూం ఇళ్లకు వెళ్లేందుకు ఉన్న దారి జెన్ కో వారి ఆధీనంలో ఉండడం.. వారు రహదారి నిర్మించుకునేందుకు అనుమతి ఇవ్వకపోవడంతో అధికారులు ఏమి చేయలేని పరిస్థితి ఏర్పడింది. గత ప్రభుత్వం రోడ్డు నిర్మాణ పనుల కోసం రూ.3కోట్లు ఇప్పటికే మంజూరు చేసింది. ప్రస్తుతం నివాసం ఉంటున్న ప్రజలకు ఇప్పుడే లీకేజీ సమస్య వెంటాడుతోంది. బాత్ రూంలలో లీకేజీల కారణంగా నీరు ఉపయోగించలేని పరిస్థితి. చాలా కాలంగా నిరుపయోగంగా ఉండడంతో తలుపులు, కిటికీలు పగిలిపోయి ఉన్నాయి. అక్కడ నివాసం ఉంటున్న వారు సొంత డబ్బులు పెట్టుకొని మరమ్మతులు చేయించుకుంటున్నారు. ప్రతి నెల ఇంటికి రూ.1000లు వేసుకొని మెయింటెనెన్స్ డబ్బులు ఇస్తున్నారు. దొంగల నుంచి రక్షణ కొరకు ప్రతి బ్లాకులోని లబ్ధిదారులు కొంత మొత్తం వేసుకొని సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటున్నారు.

ఈ ఏడాది రాలేదు

మాకు శంకర్‌పల్లిలో ప్రభుత్వం ఇల్లు కేటాయించింది. అయితే ఇక్కడ మౌలిక సదుపాయాల ఏర్పాటుకు ఇంకా సమయం పడుతుందని అధికారులు చెప్పడంతో మా పిల్లలని అక్కడే పాఠశాలలోనే కొనసాగించాం. ఇప్పుడు పనులు పూర్తయ్యాయి. కానీ రాలేకపోతున్నాం. వచ్చే ఏడాది నుంచి వచ్చి డబుల్ ఇళ్లలోనే ఉంటాం.

– రాకేశ్, లబ్ధిదారుడు, జియాగూడ

ఇబ్బంది పడుతున్నాం

మేం వచ్చి నెలరోజులవుతోంది. ఇక్కడ పలు రకాల సమస్యలు ఉన్నాయి. వర్షాకాలం కావడం, సరైన రోడ్డు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. స్ట్రీట్‌లైట్స్, వాటర్ లీకేజీ సమస్యలను అధికారులు సత్వరమే పరిష్కరించాలి.

– వినయ్, లబ్ధిదారుడు, కార్వాన్

ఈనెల 15 వరకు అప్పగిస్తాం

7 నుంచి 14 వరకు ఉన్న బ్లాకులను ఈనెల 15వరకు లబ్ధిదారులకు అప్పగిస్తాం. మౌలిక సదుపాయాల పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. రోడ్డు నిర్మాణానికి ఇప్పటికే జెన్ కో వారికి వినతి పత్రం ఇచ్చాం. అనుమతి రాగానే ఆ పనులను త్వరగానే పూర్తిచేస్తాం.

– రామకృష్ణ, ఏఈ, హెచ్‌ఎండీఏ



బొబ్బిలి చెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: వినాయక నిమజ్జనోత్సవం సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూచించారు. వినాయకుడి నిమజ్జనానికి అధికారులు షాద్‌నగర్ శివారులో ఉన్న బొబ్బిలి చెరువు వద్ద ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా చెరువు వద్ద ఏర్పాట్లను ఎమ్మెల్యే పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మున్సిపల్, పోలీస్, అగ్నిమాపక సిబ్బంది చెరువుల వద్ద అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని సూచించారు. ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వర్షాలు కురిసిన నేపథ్యంలో చెరువుల్లో నీరు నిండాయని రాత్రి వేళల్లో భక్తులు చెరువుల్లోకి వెళ్లే అవకాశాలు ఉన్నాయని దీంతో ప్రమాదం జరగవచ్చన్నారు. చెరువుల వద్ద ప్రత్యేకంగా భారీకేడ్లను ఏర్పాటు చేయాలని సూచించారు. చెరువు వద్ద గజ ఈతగాళ్లను, బోటును ఏర్పాటు చేయాలన్నారు. అదేవిధంగా చెరువు వచ్చే మార్గాల్లో గుంతలు ఉంటే వాటిని మట్టితో పూడ్చాలన్నారు. అవసరం అయితే నిమజ్జనోత్సవానికి తాను స్వతాహాగా నిధులు సమకూరుస్తానన్నారు. భక్తులకు ఎలాంటి ఆటంకాలు కల్పించకుండా పూర్తి భద్రతా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. భక్తులు కూడా అధికారులకు సహకరించి ప్రశాంతంగా నిమజ్జనోత్సవాన్ని జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏసీపీ రంగస్వామి, పట్టణ సీఐ విజయ్‌కుమార్, కమిషనర్ వెంకన్న, నాయకులు బాబర్‌ఖాన్, విశ్వం, చల్లా శ్రీకాంత్‌రెడ్డి, చెన్నయ్య, విజయ్‌కుమార్‌రెడ్డి, వన్నాడ ప్రకాశ్‌గౌడ్, సర్వర్‌పాషా, బస్వం, భార్గవ్‌కుమార్, ఖాదీర్, ముబారక్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించాలి

కేశంపేట: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించి ఉత్తమ ప్రతిభ కనబర్చాలని మండల ఇన్‌చార్జి విద్యాధికారి మనోహర్ అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ 14, అండర్ 17 బాలబాలికల క్రీడాపోటీలను బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మనోహర్ క్రీడలను ప్రారంభించిన అనంతరం మాట్లాడుతూ.. విద్యార్థులు క్రీడల్లో రాణించి జాతీయస్థాయికి ఎదగాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి, నోడల్ అధికారి చంద్రశేఖర్, హెచ్‌ఎం విద్యావతి, ఎంపీఓ కిష్టయ్య, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



క్రీడలను ప్రారంభిస్తున్న ఇన్‌చార్జి విద్యాధికారి మనోహర్, ఉపాధ్యాయులు

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది

ఎస్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పోచయ్య



ఉపాధ్యాయులతో ఎస్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పోచయ్య, ఎంఈఓ శంకర్

మొయినాబాద్ రూరల్: ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని ఎస్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు యూ.పోచయ్య పేర్కొన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో మండల విద్యాధికారి శంకర్ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన ఉపాధ్యాయులకు ఘనంగా సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పోచయ్య పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదన్నారు. మండలంలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని ఆయన అభినందించారు. అనంతరం ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి సంధ్య, హెచ్‌ఎం రేణుక, ఉపాధ్యాయులు మల్లయ్య, బందయ్య, సత్యనారాయణరెడ్డి, బాలమణి, రవిచందర్, కవిత, మహేశ్వరి, మంజుల, అలివేలు మంగ, విజయలక్ష్మి, సుమ, సునిత, మాలతీ, శారద, సుజాత, సులోచన, అహ్మద్, కృష్ణ, కవితరాణి, బాలమణి, మంగ, మానసవీణ ఉన్నారు.

రోడ్డుకు మరమ్మతులు



గోతిని పరిశీలిస్తున్న పంచాయతీరాజ్ అధికారులు

కేశంపేట: వర్షాలకు దెబ్బతిన్న కల్వర్టుపై గల రోడ్డుకు అధికారులు బుధవారం మరమ్మతులు చేపట్టారు. షాద్‌నగర్, అమనగల్లు నుంచి మండల పరిధిలోని బోధునంపల్లి గ్రామానికి బీటీరోడ్డు సౌకర్యం ఉంది. ఇటీవల కురిసిన వర్షాలకు ఈ రోడ్డుపైన ఉన్న కల్వర్టు వద్ద భారీ గోతి ఏర్పడింది. ఈ విషయాన్ని గ్రామస్తులు ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డికి బుధవారం తెలిపారు. స్పందించిన అధికారి పంచాయతీరాజ్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో అక్కడికి వచ్చిన అధికారులు గోతిని పరిశీలించిన అనంతరం గోతిని పూడ్చివేయించి రాకపోకలను కొనసాగించారు. సమస్య పరిష్కారానికి అధికారులు తక్షణమే స్పందించిందుకు గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏఈలు హేమంత్, నర్సింగ్‌రావు, భూపాల్ తదితరులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న రోడ్లను బాగుచేయండి

వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ కన్వీనర్ శ్రీనునాయక్



తహసీల్దార్ అజీంఅలీకి వినతిపత్రం అందిస్తున్న శ్రీనునాయక్ తదితరులు

కేశంపేట: ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలో దెబ్బతిన్న రోడ్లకు ప్రభుత్వం వెంటనే మరమ్మతులు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ కన్వీనర్ శ్రీనునాయక్ కోరారు. మండల కేంద్రంలో తహసీల్దార్ అజీంఅలీకి రోడ్లకు మరమ్మతులు చేయాలని కోరుతూ బుధవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాలకు రోడ్లు దెబ్బతినడంతో పాటు గ్రామాల్లో పంటలు నీటమునిగి, రైతులకు నష్టం జరిగిందన్నారు. అదేవిధంగా గ్రామాల్లో ఇళ్లు కూలిపోవడంతో చాలా కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రోడ్లకు మరమ్మతులు నిర్వహించి, ఇళ్లు కోల్పోయిన వారికి డబుల్ బెడ్రూంలను మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అదేవిధంగా పంటలను నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని, వర్షాలకు గ్రామాల్లో అంటువ్యాధులు వ్యాప్తిచెందే అవకాశం ఉందని, గ్రామాల్లో వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ శ్రీనివాస్, మచ్చేందర్, మహేశ్, ఆంజనేయులుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి హరీశ్‌రావుకు ఘన స్వాగతం



మాజీ మంత్రి హరీశ్‌రావుకు స్వాగతం పలుకుతున్న నాయకులు

చేవెళ్ల: మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావుకు మండల నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. బుధవారం ఆయన బీఆర్‌ఎస్ రాష్ట్ర యువ నాయకుడు కార్తీక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిలతో కలిసి హైదరాబాద్ నుంచి పరిగికి వెళ్తూ మార్గమధ్యలో మండల కేంద్రంలోని షాబాద్ చౌరాస్తాలో ఆగారు. ఆయనకు చేవెళ్ల బీఆర్‌ఎస్ నాయకులు ఘన స్వాగతం తెలిపారు. శాలువాలు కప్పి సన్మానించారు. ఈ సందర్భంబగా వారితో ఆయన మాట్లాడుతూ.. పార్టీ కోసం అందరూ కలిసికట్టుగా ఉంటూ పనిచేయాలని భవిష్యత్ మనదేనని చెప్పారు. బీఆర్‌ఎస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు ఎం.బాల్‌రాజ్, జంగారెడ్డి, రామగౌడ్, మాణిక్యరెడ్డి, నర్సింలు, వై.కృష్ణ, వెంకటేశ్, మాధవ్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, గని, రాంప్రసాద్, డీఎం చందు, నరేందర్‌రెడ్డి, మహేందర్, నర్సింలు తదితరులు ఉన్నారు.

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



పోషణ్ అభియాన్‌లో పాల్గొన్న సిబ్బంది

కేశంపేట: మండల పరిధిలోని పాపిరెడ్డిగూడలో బుధవారం స్త్రీ శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో పోషణ్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సిబ్బంది పోషకాహారంపై మహిళలు, గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. చిన్నారులకు పోషకాహారం అందిస్తేనే సరైన ఎదుగుదల ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కేశంపేట సెక్టార్ సూపర్‌వైజర్ దివ్యసింగ్, ఉపాధ్యాయురాలు మాధవి, రుద్రమదేవి, అంగన్‌వాడీ టీచర్లు స్వప్న, భారతి, లక్ష్మి, సుమతి, మహిళలు, గర్భిణులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు బాగుచేయించాలని వినతి

ఎమ్మెల్యే ఆదేశాలతో మరమ్మతులు చేపట్టిన అధికారులు



రోడ్డుకు మరమ్మతులు చేయిస్తున్న అధికారులు

చేవెళ్ల: మండలంలోని ఆలూరు రోడ్డు ఇటీవల కురిసిన వర్షాలకు పూర్తిగా గుంతలమయంగా మారి ఇబ్బంది పడుతున్నామని స్థానికులు ఎమ్మెల్యే కాలె యాదయ్య దృష్టికి తీసుకెళ్లటంతో స్పందించిన ఎమ్మెల్యే మరమ్మతులకు ఆదేశించారు. బుధవారం గ్రామానికి చెందిన యువకులు సునిల్, రమేశ్, బల్వంత్, రవికుమార్ ఎమ్మెల్యే కాలె యాదయ్యను కలిసి గ్రామం నుంచి తలారం వెళ్లే బీటీరోడ్డు గుంతలమయంగా మారటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈరోడ్డు డబుల్ రోడ్డు వేసేందుకు నిధులు మంజూరయ్యాయని అంటున్నారే కానీ ఇప్పటివరకు అధికారులు పనులు చేయలేదని ఎమ్మెల్యేకు తెలిపారు. దీనిపై ఎమ్మెల్యే కాలె యాదయ్య వెంటనే స్పందించి ఆర్‌అండ్‌బీ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. ప్రస్తుతం ఈ రోడ్డుపై ఉన్న గుంతలను వెంటనే పూడ్చి ప్రజల సమస్యను తీర్చాలని చెప్పారు. దీంతో వెంటనే స్పందించిన అధికారులు ఆలూరు రోడ్డుకు మరమ్మతులు చేపట్టారు. దీంతో గ్రామస్తులు ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ రోడ్డును కూడా త్వరగా వేయించాలని కోరారు.



షాబాద్: మాచన్‌పల్లిలో వినాయకుడికి పూజలు చేస్తున్న నాయకులు



షాబాద్: నాగర్‌గూడలో వినాయకుడికి ప్రత్యేక పూజలు చేస్తున్న గ్రామస్తులు



మొయినాబాద్‌రూరల్: అజీజ్‌నగర్ చౌరస్తాలో పూజలో పాల్గొన్న బీఆర్‌ఎస్ నాయకులు

దండాలయ్యా.. ఉండ్రాలయ్యా

చేవెళ్ల, షాద్‌నగర్ నియోజకవర్గాల్లో గణేశ్ నవరాత్రులను భక్తిశ్రద్ధలతో జరుపుకుంటున్నారు. ఉత్సవాల్లో భాగంగా ఐదవ రోజు బుధవారం ఆయా మండపాల్లో గణనాథులకు ప్రత్యేక పూజలు చేశారు. పూజా కార్యక్రమాల్లో స్థానికులతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు మండపాలకు చేరుకొని గణపతి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. స్వామివారికి ఇష్టమైన నైవేద్యాలు సమర్పించి జయములివ్వు బొజ్జగణేశా అంటూ వేడుకున్నారు. పలు మండపాల వద్ద నిర్వాహకులు అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. ఆయా గ్రామాల్లోని పలు వినాయకులను నిమజ్జనానికి తరలిస్తున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన లడ్డూ వేలం పాటలో భక్తులు ఉత్సాహంగా పాల్గొని స్వామివారి ప్రసాదాన్ని దక్కించుకున్నారు. అనంతరం గణనాథులను నృత్యాలు, ఆటాపాటలతో నిమజ్జనానికి తీసుకెళ్లారు.



షాద్‌నగర్: సీఐ విజయ్‌కుమార్‌ను సన్మానిస్తున్న యూత్‌సభ్యులు



కొందుర్గు: గణనాథుడికి పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి తదితరులు



చేవెళ్ల: వినాయకుడి పూజలో పాల్గొన్న భక్తులు



చేవెళ్ల: వినాయకుడి లడ్డూ దక్కించుకున్న ఏజీపీ న్యాయవాది యాదిరెడ్డి



చేవెళ్ల: గుండాలలో లడ్డూ దక్కించుకున్న గ్రామస్తులు, సంఘం నాయకులు



మొయినాబాద్‌లో నిమజ్జనానికి తరలుతున్న వినాయకుడు

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
జి. మల్లికార్జున్
9505507564